ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..



# మహాజాతర షురూ

- ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు
- టీటీడీ తరపున ఈవో, శృంగేరి పీఠం తరపున స్వామిజీ..
- జాతరకు ముందే తరలివచ్చిన భక్తులు
- ముమ్మరంగా ఏర్పాట్లు



**ప్రజానావ, రాజన్న సిరిసిల్ల :** మహా శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారికి రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దంపతులు మంగళవారం రాత్రి రాజన్నకు పట్టువస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు వేద మంత్రోచ్ఛరణలతో రాజన్నకు పట్టువస్త్రాలను సమర్పించి స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు వారికి వేదోక్త ఆశీర్వచనం ఇచ్చి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. అనంతరం గుడి చెరువు మైదానంలో ఏర్పాటు చేసిన శివార్చన కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సంధర్బంగా మంత్రి మీడియాతో మాట్లాడారు. అలాగే తిరుమల తిరుపతి దేవస్థానం తరపున జెడి లోకనాథం ప్రతినిధుల బృందం, శృంగేరి పీఠం రాధాకృష్ణ శర్మ లు పట్టువస్త్రాలను సమర్పించారు.

## జాతరకు మెరుగైన సౌకర్యాలు : పొన్నం

మహా శివరాత్రి జాతరకు వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. వివిధ రాష్ట్రాల నుండి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేలా వసతులు కల్పిస్తున్నట్లు చెప్పారు. మహా శివరాత్రి పర్వదినాన ఉపవాస దీక్షలు చేసే భక్తులకు రాజన్న ఆశీర్వాదం ఉండాలని కోరుకున్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం కలిసి రాజన్న ఆలయ అభివృద్ధి కోసం శంకుస్థాపనలు చేసుకున్నామని, వచ్చే మహా శివరాత్రి లోపు పనులు పూర్తయ్యేలా కృషి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ కృషితో ఆలయ అభివృద్ధి జరగనుందని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉండేలా రాజన్నను కోరుకున్నామన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా వేములవాడలో రాజన్నకు కోడె మొక్కు విశిష్టమైనదన్నారు. మూడు రోజుల పాటు జరిగే మహా శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తులు రాజన్నను దర్శించుకుని సుఖసంతోషాలతో ఉండాలన్నారు.



## టీటీడీ పట్టు వస్త్రాలు సమర్పణ

ప్రజానావ, వేములవాడ: తిరుమల తిరుపతి దేవస్థానం తరపున టీటీడీ ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆలయ అర్చకులు, ఈవో వినోద్ ఆయనకు ఆలయ ఆచారాల ప్రకారం స్వాగతం పలికారు. పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. అర్చక స్వాములు వారిని ఆశీర్వదించారు.



## శృంగేరి పీఠం నుంచి..

శృంగేరి శారదా పీఠం తరుపున రాధాకృష్ణ శర్మ స్వామివారికి పట్టు వస్త్రాలతో పాటు రుద్రాక్ష మాలను సమర్పించారు.ఆలయ అర్చక స్వాములు,ఈవో వినోద్ గారు స్వస్తితో స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు

### ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఆలయం ముస్తాబు

### మహాశివరాత్రి జాతర ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, ఎస్పీ

**ప్రజానావ, వేములవాడ:** దక్షిణకాశీ క్షేత్రం, వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర సందర్భంగా ప్రభుత్వ యంత్రాంగం సామాన్య భక్తులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. మంగళవారం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానాన్ని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ లు దర్శించుకుని, మహాశివరాత్రి జాతర సందర్భంగా చేపట్టిన ఏర్పాట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఆలయ అధికారులు పలు సూచనలు చేశారు. క్యూ లైన్లు, కోడె మొక్కు లైన్, ధర్మగుండం, ప్రధాన ద్వారం, ప్రసాదం తయారీ కేంద్రాన్ని, అంబేద్కర్ కూడలిని పరిశీలించారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీస్ శాఖ తరపున పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. కార్యక్రమంలో వేములవాడ ఆర్డీఓ రాజేశ్వర్, ఆలయ ఈఓ వినోద్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తహశీల్దార్ మహేష్, ఈఈ రాజేష్, సీఐ వీరప్రసాద్, తదితరులు ఉన్నారు.






















